క్లుప్తంగా

నేడు కందుల కొనుగోళ్లు ప్రారంభం



కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

సాక్షి ఎఫెక్ట్..

ఇచ్చోడ: కందులు అమ్ముకు నేదెట్లా...? శీర్షికన 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ స్పందించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ రాజర్షిషా, మార్క్ ఫెడ్ డీఎం ప్రవీణ్‌రెడ్డిలతో ఫోన్‌లో మాట్లాడారు. మూడు మండలాల రైతుల కోసం ఇచ్చోడ మార్కెట్ యార్డులో కందుల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. మంగళవారం ఇచ్చోడ వ్యవసాయ మార్కెట్ యార్డులో కొనుగోళ్ల కేంద్రాన్ని ప్రారంభించే దిశగా చర్యలు తీసుకోవాలని మార్క్‌ఫెడ్ డీఎం మౌకిక ఆదేశాలు జారీ చేశారు. కాగా ప్రాథమిక సహకార సంఘం అధికారులు కందుల కొనుగోళ్ల కేంద్రం ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు.

ఓటరు తుది జాబితా విడుదల



జాబితా విడుదల చేస్తున్న ఎంపీడీవో లక్ష్మణ్

ఇచ్చోడ: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల ఎంపీటీసీ ఓటర్ తుది జాబితాను విడుదల చేశారు. మండలంలోని 13 ఎంపీటీసీ స్థానాల్లో 35,323 మంది ఓటర్లు ఉన్నట్లు ఆయన తెలిపారు. పురుషులు 17,172 మంది, మహిళలు 18,150 మంది ఇతరులు ఒకరు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఓటరు తుది జాబితా విడుదల చేసిన వారిలో ఎంపీవో సత్యానంద్, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దీపోత్సవం



ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

తాంసి: మండలంలోని పొలోడి గ్రామశివారులో ఉన్న రాములగుట్ట జాతర గత మూడు రోజులుగా జరుగుతోంది. జాతరలో భాగంగా ఆలయ ప్రాంగణంలో పండితుల మంత్రోచ్చారణల నడుమ హోమం, అర్చనతో పాటు వివిధ రకాల పూజలు నిర్వహిస్తున్నారు. సోమవారం సాయంత్రం ఆలయంలో గ్రామ మహిళలు ఘనంగా దీపోత్సవం నిర్వహించారు. 365 దీపాలను వెలిగించి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగారెడ్డి, గ్రామ పెద్దలు ఆశన్న, సతీశ్, అంకుశ్, మహిళలు తదితరులు ఉన్నారు.

సెల్‌ఫోన్‌ల అప్పగింత



సెల్‌ఫోన్‌లు అందజేస్తున్న సురేందర్ రావు

కైలాస్‌నగర్: వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో బాధితులు పోగొట్టుకున్న 19 సెల్‌ఫోన్‌లను ఏఎస్పీ సురేందర్‌రావు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో బాధితులకు అందజేశారు. వన్‌టౌన్ పరిధిలో 9, జైనథ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏడు, ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ముగ్గురు సెల్‌ఫోన్లను పోగొట్టుకుని ఫిర్యాదు చేశారు. డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, సీఐలు సునీల్ కుమార్, ఫణీందర్, జైనథ్ ఎస్సై పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

నేరడిగొండ: విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని హెచ్ఈవో పవార్ రవీందర్ అన్నారు. సోమవారం మండలంలోని కుంటాల బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భోజనం చేసే ముందు, తర్వాత చేతులను శుభ్రం చేసుకోవాలని సూచించారు. 50 మంది విద్యార్థులకు ఎనీమియా పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, ఎంఎల్‌హెచ్‌పీ నిఖత్, ఏఎన్ఎం జ్యోతి, హెల్త్ అసిస్టెంట్ సాయన్న, శ్రీనివాస్ రెడ్డి, హాస్టల్ ఏఎన్ఎం అశ్విన్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు బేఖాతరు!



మండల కేంద్రంలో సీసీరోడ్డు నిర్మిస్తున్న కార్మికులు

నిబంధనలు ఇవీ..

- సీసీ రోడ్డు నిర్మించేందుకు మొట్టమొదట శుభ్రం చేసిన గుంతల్లో మొరం, కంకర చూర్ణం చల్లి చదును చేయాలి.
- అడుగున పాలిథిన్ కవర్ వేసి 20ఎం.ఎం. కాంక్రీట్ మిశ్రమంతో రోడ్డు నిర్మించాలి.
- ఎనిమిది అడుగుల వెడల్పు, ఏడు అంచుల మందంతో రహదారి నిర్మించాలి.
- రోడ్డు కుంగిపోకుండా మూడు మీటర్లకు ఒక అంగుళం చొప్పున ఖాళీ వదిలేయాలి.
- తప్పనిసరిగా 28 రోజుల పాటు క్యూరింగ్ చేయాలి.

- సీసీరోడ్ల నిర్మాణానికి నిధులు విడుదల
- రూ.30 కోట్ల వ్యయంతో పలు చోట్ల జరుగుతున్న పనులు
- కరువవుతున్న అధికారుల పర్యవేక్షణ
- నెలలకే ఛిద్రమవుతున్న రోడ్లు

నేరడిగొండ: ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తున్నా నాణ్యత లోపంతో నిర్మాణాలు మూన్నాళ్ల ముచ్చటగానే మారుతున్నాయి. ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపంతో పనులు నాసిరకంగా జరుగుతున్నాయి. ఏటా ఉపాధిహామీలో లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన సీసీరోడ్లు కొద్ది నెలలకే ఛిద్రమవుతున్నాయి. ఆర్థిక సంవత్సరం చివరలో హడావుడి పనులు చేస్తుండడంతో ఈ పరిస్థితి నెలకొంటుంది. ఈ ఏడాది మరో రెండు నెలల సమయమే ఉన్న నేపథ్యంలో ఈసారైనా నాణ్యత ప్రమాణాలు పాటిస్తేనే నిధులకు సార్థకత లభిస్తుందని పలువురు పేర్కొంటున్నారు. మండలంలో సీసీ రోడ్ల పనులను చేపట్టగా, అక్కడ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం గమనార్హం.

కొరవడిన పర్యవేక్షణ..

గ్రామీణ ప్రాంతాల్లో నిర్మిస్తున్న సీసీ రోడ్లపై పర్యవేక్షణ కొరవడింది. నిర్మాణాల్లో నిబంధనలు గాలికొదిలేస్తున్నారు. చాలా చోట్ల పనులు చేసే సమయంలో ఇంజనీరింగ్ అధికారులు చుట్టపు చూపుగా వెళ్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దాదాపు నెల రోజులు క్యూరింగ్ చేయాల్సి ఉండగా, నామమాత్రంగా నీళ్లు పట్టి వదిలేయడంతో పటిష్టత కోల్పోతోంది. ఇరువైపులా రోడ్డు దెబ్బతినకుండా మొరం (సైడ్ బర్మ్) చల్లడం లేదు. దీంతో కొద్ది రోజులకే పగుళ్లు తేలుతున్నాయి.

మేల్కొంటేనే ప్రగతి..

జిల్లాలో రూ.30 కోట్ల వ్యయంతో 624 ప్రాంతాల్లో సీసీ రోడ్లను నిర్మిస్తున్నారు. మార్చి నెలాఖరులోగా పూర్తి చేయాలన్న లక్ష్యంతో పనులు ముమ్మరంగా చేపట్టారు. గతేడాది ఫిబ్రవరి చివరిలో పనులు ప్రారంభించడంతో ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించలేదు. దీంతో నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. ఈసారి ముందస్తుగా పనులు చేస్తున్నారు. నిర్ణీత వ్యవధిలో పూర్తవుతాయని అధికారులు భావిస్తున్నారు.

బిల్లులు నిలిపివేస్తాం..

గ్రామాల్లో ఉపాధిహామీ నిధులతో సీసీరోడ్ల నిర్మాణాలు ప్రారంభిస్తున్నాం. నాణ్యత ప్రమాణాలు పాటించేలా సిబ్బంది నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుంది. నిర్మాణాల్లో ఎలాంటి రాజీలేదు. పనులు నాసిరకంగా చేపడితే బిల్లులు నిలిపివేస్తాం.

– శివరాం, ఈఈ, పంచాయతీరాజ్

'టీబీ నిర్మూలనకు కృషి చేద్దాం'



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

ఇంద్రవెల్లి: టీబీ వ్యాధి నిర్మూలన కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందని ఏజెన్సీ అదనపు వైద్యాధికారి కుడ్మెత మనోహర్ అన్నారు. సోమవారం మండలంలోని ముత్నూర్ గ్రామానికి సందర్శించి టీబీ వ్యాధి నివారణ, ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ దగ్గు, జ్వరం, ఛాతిలో నొప్పి, ఆకలి లేకపోవడం, రాత్రి పూట నిద్రలో చెమటలు పట్టడం, అలసట, శ్వాస ఆడకపోవడం, దగ్గినప్పుడు రక్తం పడడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధి గ్రస్తులను గుర్తించి పౌష్టికాహారం కోసం నెలకు రూ.1000 అందించడంతో పాటు ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా మందులు అందిస్తామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు శ్రీకాంత్, పూజిత, సీహెచ్‌వో సందీప్, హెచ్ఈవో రాందేవ్, హెల్త్ సూపర్‌వైజర్ సురేశ్, వైద్య సిబ్బంది ఉన్నారు.

రైల్వే అండర్‌బ్రిడ్జి నిర్మాణ స్థలం పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని తాంసి బస్టాండ్ వద్ద గల రైల్వే ట్రాక్‌పై చేపట్టనున్న రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ స్థలాన్ని సోమవారం అధికారులు పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, రైల్వేఆర్అండ్ ఇంజనీర్లతో కలిసి సంయుక్త పరిశీలన చేపట్టారు. అండర్ బ్రిడ్జి నిర్మాణం జరిగితే వర్షపునీరు బయటకు ఎలా వెళ్లాలనే దానిపై పరిశీలించారు. పట్టణంలోని పంజాబ్‌చౌక్, మహలక్ష్మివాడలోని ఆర్‌యుబీ వద్ద గల స్థలాన్ని పరిశీలించిన అధికారులు నీరు వెళ్లే మార్గంపై సాధ్యాసాధ్యాలను తెలుసుకున్నారు. మహలక్ష్మివాడ ఆర్‌టీబీ వద్దకు నీటిని మళ్లించడం అనుకూలంగా ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేశారు. పూర్తిస్థాయి అధ్యయనం చేపట్టాక తగు చర్యలు తీసుకుంటామని కమిషనర్ వెల్లడించారు.

సంక్షిప్త వార్తలు

వాగులో అడ్డుకట్టలు తొలగించాలి

బోథ్: సొనాల మండలంలో చింతలబోరి, గొల్లాపూర్ గ్రామాల నుంచి వచ్చే వాగుల్లో అడ్డుగా కట్టలను ఏర్పాటు చేయడం వల్ల సొనాలతో పాటు, ఇతర గ్రామాలకు వాగు నీరు రావడం లేదని గ్రామస్తులు పేర్కొన్నారు. వాగులో నిర్మించిన అడ్డుకట్టలను తొలగించాలని సోమవారం తహసీల్దార్ మల్లేశ్‌కు వినతిపత్రం అందించారు. భూగర్భ జలాలు పడిపోతున్న తరుణంలో వాగులో నీరు లేక పశువులకు కనీసం తాగునీరు లేని పరిస్థితి నెలకొందన్నారు. అధికారులు చొరవ చూపి వాగులో కట్టిన కట్టలను తొలగించాలన్నారు.

శబరిమాత ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

బోథ్: మండలంలోని కుచులాపూర్ గ్రామంలో శబరిమాత ఆలయ మొదటి వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. శబరిమాత పల్లకి శోభాయాత్రలో ఎమ్మెల్యే పాల్గొని పల్లకి మోశారు. భజన సంకీర్తనల మధ్య గ్రామంలో పల్లకి శోభా యాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎంపీపీ తుల శ్రీ నివాస్, మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

నేరడిగొండ: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మండలంలోని నాగమల్యాల్, గాజిలి గ్రామస్తులు కోరారు. సోమవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మండల కేంద్రంలోని ఆయన నివాసంలో వేర్వేరుగా కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ త్వరలోనే గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

రోడ్డుకు కొంతదూరంలో మొక్కలు నాటాలి

బోథ్: మండల కేంద్రం నుంచి నిగిని గ్రామం వరకు రోడ్డుకు ఇరువైపులా అటవీశాఖ అధికారులు మొక్కలు నాటడానికి గుంతలు తవ్వారు. మొక్కలు నాటేందుకు తవ్విన గుంతలను రోడ్డుకు మీటరున్నర దూరంలో తవ్వాలని బాబెరతండా గ్రామస్తులు కోరుతున్నారు. రోడ్డు కు దగ్గరగా మొక్కలు నాటితే పెరిగిన తర్వాత ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

నేరడిగొండ: చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తేజాపూర్ గ్రామస్తుడు చొలమద్ది రంజిత్ అన్నారు. ఆయన తండ్రి చిన్న నర్సయ్య జ్ఞాపకార్థం తేజాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు.

తాంసి: భీంపూర్ మండలంలోని నిపాని ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కప్పర్ల ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న విలాస్‌గౌడ్, కృష్ణకుమారి దంపతులు తమ వంతుగా పాఠశాలలో విద్యార్థులకు స్టడీమెటీరియల్ అందజేశారు.

ఎంపీడీవో, తహసీల్దార్లకు సన్మానం

కైలాస్‌నగర్(జైనథ్): ఇటీవల కొత్తగా ఆవిర్భవించిన భోరజ్ మండలం ఎంపీడీవో, తహసీల్దార్లుగా బాధ్యతలు చేపట్టిన వేణు, రాజేశ్వరిలను గ్రామ పెద్దలు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వారిని శాలువాతో సత్కరించారు.

ఎమ్మెల్సీ నామినేషన్ కార్యక్రమానికి 'కంది'

కైలాస్‌నగర్: ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల కాంగ్రెస్ పార్టీ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి వి.నరేందర్ రెడ్డి సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. కరీంనగర్‌లో జరిగిన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి హాజరయ్యారు. రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌లను కలిసి పలు విషయాలపై చర్చించారు. వారిని శాలువాలతో సత్కరించారు. అనంతరం ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఆధ్వర్యంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొన్నారు.

దేశీదారు స్వాధీనం

కైలాస్‌నగర్: జైనథ్ మండలంలోని బెల్గాం గ్రామంలో అక్రమంగా విక్రయిస్తున్న దేశీదారు సీసాలను మండల పోలీసులు సోమవారం పట్టుకున్నారు. మేస్రం పొచ్చిరాం అనే వ్యక్తి గ్రామంలోని తన పాన్‌షాప్‌లో నిషేధిత దేశీదారు అమ్ముతున్నాడనే విశ్వసనీయ సమాచారం మేరకు జైనథ్ ఎస్సై వి. పురుషోత్తం, ఏఎస్సై ఆత్మారాం పోలీసు సిబ్బందితో కలిసి పాన్‌షాప్‌లో తనిఖీ చేశారు. 192 క్వార్టర్స్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. 17.28 లీటర్ల దేశీదారు విలువ రూ.5,184 ఉంటుందని ఎస్సై తెలిపారు. నిషేధిత దేశీదారు బాటిల్స్ స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లుగా వెల్లడించారు.

డిప్యూటీ సీఎంను కలిసిన సంతోష్



డిప్యూటీ సీఎంతో సంతోష్

తాంసి: రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కను కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ సంతోష్ సోమవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని మత్తడివాగు ప్రాజెక్టు డీ -1, డీ-2 కాలువల మరమ్మతుతో పాటు రోడ్ల నిర్మాణానికి, ఇళ్లకు నిధులు కేటాయించాలని కోరారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

బోథ్: విద్యార్థులు సైబర్‌క్రైమ్ పట్ల జాగ్రత్త వహించాలని బోథ్ సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో సైబర్ క్రైమ్, డ్రగ్స్, మత్తు పదార్థాలను తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. పోలీసు కళాబృందం పాటలతో, నాటికలతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. విదార్థులు ఆన్‌లైన్ మోసాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఎస్సై ఎల్.ప్రవీణ్ కుమార్, ఉపాధ్యాయులు ప్రవీణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండడంతో పాటు అవగాహన కలిగి ఉండాలని సైబర్‌క్రైమ్ పోలీస్ కానిస్టేబుల్ సంతోష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు, ప్రజలకు సైబర్‌నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సైబర్‌నేరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయన్నారు. ఎవరైనా కాల్ చేస్తే బ్యాంక్ వివరాలు, తదితర వాటిని తెలియజేయవద్దని సూచించారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు డయల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ప్రజలు యువకులు ఉన్నారు.

'విశ్వకర్మల సమస్యల పరిష్కారానికి కృషి'

బేల: విశ్వకర్మల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని, వారి న్యాయపరమైన డిమాండ్లు నెరవేర్చే విధంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్తామని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి సతీమణి కంది మౌన రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలకేంద్రంలో మరాఠీ వడ్రంగి కులస్తుల ఆధ్వర్యంలో విశ్వకర్మ భవన్ వద్ద ఏర్పాటు చేసిన విశ్వకర్మ జయంతి వేడుకల్లో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో పాయల్ ఫౌండేషన్ చైర్మన్ పాయల్ శరత్, కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్‌రావు, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు సామ రూపేష్‌రెడ్డి, జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అశోక్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్, మాజీ ఎంపీపీ రఘుకుల్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ నిపుంగే సంజయ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



ఇంద్రవెల్లి: పూజలు చేస్తున్న భక్తులు



తాంసి: పూజలు చేస్తున్న భోజారెడ్డి, లావణ్య

ఇంద్రవెల్లి: మండలంలోని గౌరపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని చత్తబట్ట గ్రామంలో గ్రామస్తులు ప్రతీనెల చందాల రూపంలో సేకరించిన రూ.21 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన హనుమాన్ మందిరంలో సోమవారం విగ్రహ ప్రతిష్ఠాపన, కళసం ఆవిష్కరణ పూజలు ఘనంగా నిర్వహించారు. సిర్పూర్ యూ మండలంలోని జిర్లఘాట్ గ్రామానికి చెందిన కుమ్ర దేవ్‌రావ్ మహారాజ్, ఇంద్రవెల్లి మండలంలోని సమాక గ్రామానికి చెందిన కోరెంగా యేశ్వంత్‌రావ్ మహారాజ్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి హనుమాన్ విగ్రహంతో పాటు కళసం ఆవిష్కరణ ఘనంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో హాజరైన భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం, గ్రామ పెద్దలు చహకటి మనోహర్, చహకటి లాల్‌షావ్, కోవ రాజేశ్వర్, పెందోర్ శ్యామ్‌రావ్, చహకటి జంగు, పెందోర్ జంగు, హనుమాన్ యూత్ సభ్యులు పెందోర్ క్రిష్ణ, కనక నాగోరావ్ తదితరులు ఉన్నారు.

వైభవంగా పోచ్చమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

తాంసి: భీంపూర్ మండలంలోని వడూర్ గ్రామంలో సోమవారం పోచ్చమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన వైభవంగా నిర్వహించారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, లావణ్య దంపతులు రూ.5లక్షలకు పైగా సొంత డబ్బులతో నూతన పోచ్చమ్మ ఆలయాన్ని నిర్మించారు. సోమవారం పండితుల మంత్రోచ్చారణల మధ్య విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. పూజా కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ దంపతులు, గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు సంజీవ్ రెడ్డి, హనుమాన్‌దాస్, జ్వాలకరణ్ రెడ్డి, మహేందర్ పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. వేంకటేశ్వర స్వామి ఆలయం పదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గత మూడు రోజులుగా ఆలయ ప్రాంగణంలో పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక బ్రహ్మోత్సవ వేడుకలు నిర్వహించారు. చివరిరోజున ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి, పద్మావతిదేవి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పండితులు కల్యాణచార్యులు, ఉమాకాంత్, రాంగోపాల్‌ల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరై ఆలయంలో పూజలు నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతాంగే బ్రహ్మానంద్, సామాజిక కార్యకర్త ముడుపు మౌనిశ్ రెడ్డితో పాటు తదితరులు పూజలు నిర్వహించారు. నిపాని ఆలయ మహరాజ్ శివదత్తగిరి మహరాజ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు నందయ్య, నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి



పూజలు చేస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తలమడుగు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాన్ని అలవర్చుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం తలమడుగు మండలంలోని నందిగామ గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ ఆలయ నిర్మాణం కోసం కృషి చేసిన ముడుపు భూమారెడ్డి, దామోదర్ రెడ్డి, ప్రేమేందర్ రెడ్డి, కేదారేశ్వర రెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్, సామాజిక కార్యకర్త మౌనిష్ రెడ్డి నందిగామ గ్రామస్తులను గ్రామ పటేల్ మజాన్‌లను యువజన సంఘాల సభ్యులను అభినందించారు.

క్రీడాపోటీలు ప్రారంభం..

యువజన సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వాలీబాల్ పోటీలను ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రారంభించారు. మండల కన్వీనర్ తోట వెంకటేష్, శ్రీనివాస్ రెడ్డి, మొట్టే కిరణ్ కుమార్, కేదరేశ్వర్ రెడ్డి, మౌనిష్‌రెడ్డి, కాటిపెల్లి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శిని కలిసిన రామన్న



జయేశ్‌రంజన్‌కు వినతిపత్రం అందజేస్తున్న రామన్న

కైలాస్‌నగర్: రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్‌ను మాజీ మంత్రి జోగు రామన్న సోమవారం హైదరాబాద్‌లో కలిశారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో చేపట్టిన ఐటీ టవర్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆయనకు వినతిపత్రం అందజేశారు. టైర్ 2, టైర్ 3 సిటీల్లో ఐటీ సేవలను ప్రారంభించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 2022లో ఆదిలాబాద్‌కు ఐటీ టవర్‌ను మంజూరు చేసిందన్నారు. పనులు ప్రారంభించినా ఇప్పటికీ భవనం అసంపూర్తిగానే ఉందన్నారు.

క్రీడలతో యువతకు మానసికోల్లాసం



పోటీలు ప్రారంభిస్తున్న ఎస్సై దివ్యభారతి

బేల: క్రీడలతో యువతకు మానసికోల్లాసం లభిస్తుందని ఎస్సై దివ్యభారతి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని దహెగాం రెవెన్యూ గ్రామ శివారులో తిరంగ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో అంతరాష్ట్ర క్రికెట్ పోటీలు ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించడానికి, ప్రాంతాల మధ్య మెరుగైన సంబంధాల కోసం క్రీడలు ఎంతో దోహదపడుతాయని తెలిపారు. యూత్ కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు సామ రూపేశ్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్, జైనథ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వాంఖడే వామన్ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో మెరుగైన విద్య

తాంసి: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని తాంసి ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు విద్యార్థులకు సూచించారు. సోమవారం తాంసి కళాశాల అధ్యాపకులు భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటిలో అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు కళాశాలలో అందిస్తున్న సౌకర్యాలను తెలియజేశారు. అధ్యాపకులు అశోక్, తిరుపతి రెడ్డి, ప్రవీణ్, మల్లేశ్, పాఠశాల హెచ్ఎం శ్యాంసుందర్ ఉన్నారు.

పత్తి కొనుగోళ్లు తాత్కాలికంగా నిలిపివేత

ఇంద్రవెల్లి: ఆన్‌లైన్ సమస్య కారణంగా సీసీఐ పత్తి పంట కొనుగోలు కేంద్రాన్ని తాత్కాలికంగా మూసివేస్తున్నామని ఇంద్రవెల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి దేవన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ సమస్య పరిష్కారమైన వెంటనే తిరిగి సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. మండల రైతులు గమనించి అధికారులకు సహకరించాలని ప్రకటనలో కోరారు.